చెరువు.. భారీగా మురుగు!



మేడ్చల్: పట్టణంలోని ప్రధాన చెరువుల్లో ఒకటైన తుమ్మ చెరువు చెత్తమయంగా మారుతోంది. సమీప ప్రాంతాల్లో నివసించే వారు, వ్యాపారులు ఇష్టానుసారంగా చెరువు వద్ద చెత్త వేస్తుండటంతో చెరువంతా చెత్తతో దర్శనమిస్తోంది. మేడ్చల్ పట్టణంలో ఆరుబయట చెత్త వేయవద్దని, మలమూత్ర విసర్జన చేయవద్దని, చేస్తే రూ.500ల జరిమానా అని పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేసినా వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా వ్యాపారులు, వివిధ ప్రాంతాల్లో ఉన్న వారు ఇష్టానుసారంగా చెరువులో చెత్త వేస్తుండటంతో నీరు కలుషితం అవుతోంది.

మున్సిపల్ అధికారులు స్పందించాలి

చెరువు పరిసర ప్రాంతాల్లో చెత్తవేయడం, అది నీటిలో మునిగి పూర్తిగా కుళ్లిపోయి కంపు కొడుతోంది. ప్లాస్టిక్ కవర్లలో చెత్తను మూట కట్టి పడేస్తున్నారు. ఖాళీ కొబ్బరి బోండాలు, ఇళ్లలోని పనికిరాని వస్తువులను పడేస్తున్నారు. రోజుల తరబడి చెరువులో చెత్త ఉండటంతో పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఉదయం, సాయంత్రం వేళలో పాదచారులు, అటువైపుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తతో చెరువులు కలుషితం అవుతున్నాయి. బహిరంగ ప్రదేశాల్లో ప్రధానంగా పెద్ద చెరువు, తుమ్మ చెరువు, గౌడవెల్లికి వెళ్లే కుంటల్లో చెత్త వేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చెరువుల్లో భారీగా మురుగు

చెరువుల పైభాగాల్లో ఉన్న ప్రాంతాల నుంచి వస్తున్న మురుగు నీరు చెరువుల్లో కలుస్తుండటంతో కలుషితమవుతున్నాయి. మేడ్చల్ పెద్ద చెరువులోకి చెక్‌పోస్ట్ వైపు ఉన్న ఇళ్ల నుంచి మురుగు నీరు చెరువులోకి చేరుతోంది. కిందిబస్తీలోని కొన్ని ఇళ్ల నుంచి వస్తున్న మురుగు చెరువులో చేరుతోంది. తుమ్మ చెరువులో పైభాగంలో ఉన్న కాలనీలు, ప్రాంతాల నుంచి మురుగు నీరు చెరువు నీటిలో చేరుతోంది.



తుమ్మ చెరువు

క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని విజయపురికాలనీలో 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజయపురి కాలనీ, ఎస్వీనగర్, బాబూజీనగర్, మామిళ్ల నారాయణ, రేణుకా ఎల్లమ్మ కాలనీ, పీఎంఆర్, ఎస్ఎల్ఎన్, వెంకటాద్రినగర్‌కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని నాగారం ఏఈ కామేశ్వర్‌రావు తెలిపారు.

జవహర్‌నగర్...

జవహర్‌నగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ సాయిబాబా ఫీడర్ పరిధిలోని మార్కెట్ రోడ్డు, సిల్వర్‌సీ గల్లీ, సుక్కమ్మకుంట, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, సిటీజన్ కాలనీ, ముత్తుస్వామి కాలనీ, సుష్మిత నగర్, ఆనంద్‌నగర్, మోహన్‌రావుకాలనీ, వెంకటేశ్వర కాలనీ, వీరభద్రకాలనీలో విద్యుత్ ఉండదని ఏఈ ఈరన్న తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత




చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: పట్టణంలోని 17వ వార్డుకు చెందిన వ్యక్తికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును మంత్రి మల్లారెడ్డి అందజేశారు. వార్డుకు చెందిన మోహిన్‌కు రూ.30వేలు మంజూరు కావడంతో చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సందీప్‌గౌడ్, లాయక్ అలీ, విజయరావు, చింటూ, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల కోసం ప్రత్యేక బస్సులు

మేడ్చల్: మహిళా ప్రయాణికుల కోసం మేడ్చల్ నుంచి నగరానికి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు డీఎం సుధాకర్ తెలిపారు. మేడ్చల్ నుంచి సికింద్రాబాద్ వరకు రోజుకు రెండు లేడీస్ స్పెషల్ బస్సులు నడిపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 8.15 గంటలకు సికింద్రాబాద్ నుంచి సాయంత్రం 7.10 గంటలకు మేడ్చల్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు. మహిళా ప్రయాణికులు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని డీఎం కోరారు.

అంగన్‌వాడీలో పోషణ మహోత్సవాలు



ప్రదర్శన తిలకిస్తున్న నేతలు

మేడ్చల్: పట్టణంలోని 23వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవాలను నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాలు, కూరగాయలు, గుడ్లతో ప్రదర్శన నిర్వహించారు. వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు కొడే మహేష్, సాయికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి

ఘట్‌కేసర్: అవుషాపూర్ సర్వే నంబర్-349లోని 28 గుంటల సర్కారు భూమి కబ్జాదారుల నుంచి రక్షించాలని కలెక్టర్‌కు ఆ గ్రామ పాలకవర్గ సభ్యులు బుధవారం వినతి అందజేశారు. అర్ధ దశాబ్దకాలంగా ఖాళీగా ఉన్న సుమారు 1200 గజాల స్థలం చుట్టూ ఇటీవల అక్రమార్కులు ప్రహరీ నిర్మించారని లేఖలో పేర్కొన్నారు. వినతి అందజేసిన వారిలో ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, వార్డు సభ్యులు వీరేశం, కుశలవరెడ్డి, మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, రవినాయక్, నాయకులు వామన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ.. ఇదేం దుస్థితి..?

- రాత్రిపూట శామీర్‌పేట పీహెచ్‌సీలో సేవలు బంద్
- రోగులు వెళ్తే సిబ్బంది లేరంటూ.. మరోచోటికి రెఫర్
- తరచూ ఇదే తంతూ.. అయినా ఎవరూ పట్టించుకోరు..
- సోమవారం 108 వాహనంలోనే మహిళ ప్రసవం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న సామాన్య ప్రజలు



108 వాహనంలోనే మహిళకు డెలివరీ చేసిన సిబ్బంది

శామీర్‌పేట్: శామీర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి వేళలో సేవలు బంద్. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇదే నిజం. శామీర్‌పేట్ - కరీంనగర్ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఆస్పత్రి అది, ఇదే రహదారి మీదుగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు ప్రయాణిస్తుంటారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో ఉన్న ఆస్పత్రి కూడా ఇదే.. 10 గ్రామాలతో కూడిన శామీర్‌పేట మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న శామీర్‌పేట పీహెచ్‌సీలో రాత్రి వేళల్లో సేవలు అందించకపోవడం విడ్డూరం.

రాత్రి 7 గంటలు దాటితే సేవలు బంద్..

నిరుపేదలకు ఉచిత వైద్యం అందించాలనే సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పీహెచ్‌సీలను ఏర్పాటు చేసి, నిధులను కేటాయిస్తుంది. అంతేగాకుండా సరిపడా సిబ్బందిని కేటాయించి ఆపదలో వచ్చిన రోగులకు అందించాలని ఆదేశించింది. కానీ శామీర్‌పేట పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాయంత్రం 7 గంటలు తర్వాత వెళ్లిన రోగులకు అసహనంతో ప్రాథమిక చికిత్స అందిస్తారు. సమయం గడుస్తున్న కొద్దీ రోగులను ఎలా పంపించాలా అనే విధంగా వ్యవహరిస్తున్నారని పలువురు రోగులు ఆరోపిస్తున్నారు.

హడావుడిగా మరో ఆస్పత్రికి రెఫర్..

రాత్రి వేళల్లో శామీర్‌పేట ఆస్పత్రికి వచ్చిన రోగులకు ముందుగా ఇక్కడి సిబ్బంది ప్రథమ చికిత్స అందిస్తారు. ఇక అసలు కథ మొదలవుతుంది. నర్సు వచ్చి రోగిని ఇక్కడే అడ్మిట్ చేస్తే రాత్రి వేళలో ఏమైనా సీరియస్ అయితే ఎలా? మీ మంచి కోసమే చెబుతున్నా అంటూ రోగుల బంధువులతో మాట్లాడతారు. ఆస్పత్రికి సిబ్బందే అంబులెన్స్‌ను పిలిపించి మరో ఆస్పత్రికి పంపిస్తారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు.

108 వాహనంలోనే గర్భిణి ప్రసవం

శామీర్‌పేట మండలం పొన్నాల్ గ్రామానికి చెందిన సోని(26)కి రాత్రి 11 గంటల సమయంలో పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో శామీర్‌పేట పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ముందుగానే ఆస్పత్రికి చేరుకున్న తల్లి రాణి విషయాన్ని వైద్యులకు వివరించింది. ఇక్కడ సిబ్బంది లేరు.. కాన్పు చేయలేం, మరో ఆస్పత్రికి తీసుకెళ్లమంటూ దురుసుగా ప్రవర్తించారని బాధిత మహిళ వాపోయింది. 108 వాహనంలోనే గజ్వేల్ ఆస్పత్రికి తరలిస్తుండగా తుర్కపల్లి అటవీ ప్రాంతం వద్దకు చేరుకోగానే పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో వాహనాన్ని పక్కన నిలిపి 108 డాక్టర్ శ్రీకాంత్ డెలివరీ చేశాడు. ప్రస్తుతం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు సమాచారం.

బతిమిలాడినా కనికరించలేదు

కూతురుకి పురిటి నొప్పులు వస్తున్నాయని సోమవారం రాత్రి 11 గంటల సమయంలో శామీర్‌పేట ఆస్పత్రికి వెళ్లాను. ఇక్కడ సిబ్బంది లేరమ్మా.. గాంధీకి తీసుకెళ్లు.. లేదా ఏదైనా ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లు అని కోపంగా మాట్లాడారు. నా కూతురికి ఇంతకు ముందు కాన్పు కూడా ఇక్కడ చేశారు.. కొంచం కనికరించండి అంటూ బతిమిలాడినా కనికరించలేదు. దీంతో 108 వాహనంలో గజ్వేల్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా వాహనంలోనే ప్రసవం అయ్యింది. - రాణి, అంతాయిపల్లి

జవహర్‌నగర్‌లో నిరుపేదలు కనిపించడంలేదా..?



జవహర్‌నగర్‌లో మాట్లాడుతున్న మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్

- స్థానికులకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలి
- కాంగ్రెస్ నాయకుల డిమాండ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన స్థానికులకే కేటాయించాలని కాంగ్రెస్ స్థానిక అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. బుధవారం జవహర్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో స్థానికులు ఎంతోమంది దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటివరకు ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వలేదన్నారు. మంత్రి మల్లారెడ్డి జవహర్‌నగర్‌లోని అర్హులైన వారికి ఇవ్వకుండా జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్నవారికి ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రాంతవాసులు ఓట్లు వేసి గెలిపించినా మల్లారెడ్డి ప్రస్తుతం ఈ ప్రాంత ప్రజల సమస్యలను విస్మరిస్తున్నారన్నారు. జవహర్‌నగర్‌లో నిరుపేదలు కనిపించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జవహర్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానిక ప్రజలకు అందించే వరకు కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ధనమ్మ, దళిత కాంగ్రెస్ మహిళ జిల్లా కన్వీనర్ సునీత, ఉపాధ్యక్షులు మాట్ల శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాట్ల వినయ్ కుమార్, మహిళ అధ్యక్షురాలు మంగళారపు లత, బీసీ సెల్ అధ్యక్షులు సుమన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు దోయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు డబుల్ ఇళ్లను కేటాయించాలి



ఘట్‌కేసర్ తహసీల్దార్ కృష్ణకు వినతి అందజేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

ఘట్‌కేసర్: మండలం నిర్మించిన రెండు పడకల ఇళ్లలో 50 శాతం ఇళ్లను స్థానికులకు కేటాయించాలని సీపీఐ, సీపీఎం నాయకులు బుధవారం స్థానిక తహసీల్దార్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. 2015లో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేలాదిగా పేదలు దరఖాస్తు చేసుకున్నారని, స్థానికులను వదిలి ఇతర ప్రాంతాల వారికి కేటాయిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. స్థానికులకు కేటాయించిన అనంతరం ఇతరులకు పంపిణీ చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు జయచంద్ర, మండల కార్యదర్శి ఈశ్వర్, సీపీఎం మండల కార్యదర్శి సబిత, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిరోజూ యోగా చేస్తే ఎంతో ఆరోగ్యం

కీసర: ప్రతిరోజూ యోగ చేయడం అలవాటు చేసుకోవాలని ప్రముఖ యోగా గురువు, పతంజలి యువ భారత్ రాజ్యప్రచారి అశోక్ అన్నారు. కీసరలోని లక్ష్మీగార్డెన్‌లో బుధవారం శ్రద్ధ కళాశాల విద్యార్థులతో పాటు గ్రామస్తులకు యోగాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగపడే వివిధ యోగాసనాలను విద్యార్థులు, గ్రామస్తులకు నేర్పించారు.



తపాలా ఉద్యోగుల ర్యాలీ



మేడ్చల్: డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(డీసీడీపీ)లో భాగంగా మేడ్చల్‌లో తపాలా ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి వివేకానంద విగ్రహం మీదుగా మార్కెట్ మీదుగా తపాలా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తపాలా కార్యాలయం అందించే ఆధార్ మేళా, పోస్టల్ పథకాలు, సుఖన్య సమృద్ధి యోజన, ఖాతాలు, పీపీఎఫ్, బీమా సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు.

నేడు అవగాహన సదస్సు..

తపాలా శాఖా అందిస్తున్న సేవలపై గురువారం జెడ్పీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎదులాబాద్‌లో ఉచిత పశు వైద్య శిబిరం

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శిబిరంలో మొత్తం 153 గేదెలకు చికిత్స అందించారు. 8 గేదెలకు చూడి పరీక్షలు, 80 గేదెలకు నట్టల నివారణ టీకాలు, మిగిలిన వాటికి సాధారణ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన గేదెలకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారిని పద్మిని, సర్పంచ్ సురేశ్, మాజీ ఎంపీటీసీ కుమార్ ముదిరాజ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాసుల పంపిణీ

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌జీకే కాలనీలోని ప్రభుత్వ పాఠశాల్లో చదువుకునే విద్యార్థులు, 150 మందితో పాటు, కాలనీలో నివాసం ఉంటున్న సుమారు 60 మంది వికలాంగులకు, మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ నాగయపల్లి సుజాతశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉచిత బస్‌పాసులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెంగిచెర్ల డిపో మేనేజర్ కె.కవిత, అసిస్టెంట్ మేనేజర్ ఆనంద్‌రావు, ఘట్‌కేసర్ స్టేషన్ మాస్టర్ డి.వెంకటేష్ , బస్‌పాస్ ఇన్‌చార్జి రామరాజు, ప్రధానోపాధ్యాయులు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేడు'డబుల్' ఇళ్ల పట్టాల పంపిణీ



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో గురువారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను మంత్రి చామకూర మల్లారెడ్డి చేతులమీదుగా పంపిణీ చేయనున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు వికలాంగుల కాలనీ సమీపంలో నిర్మించిన ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేయనున్నారు.

ప్రభుత్వ పథకాల లక్ష్యాలను పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం పథకాల లక్ష్యాలను పూర్తి చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నామని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు, లక్ష్యాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అమయ్ కుమార్ మాట్లాడుతూ.. గృహలక్ష్మీ పథకం కింద జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేసినట్లు తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద 17వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. బుధవారం మంత్రి మల్లారెడ్డి చేతులమీదుగా గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి రైతు ఖాతాలో రుణమాఫీ డబ్బులు జమయ్యేలా చూస్తామన్నారు. నూతన పెన్షన్ మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామన్నారు. ప్రభుత్వ జీఓ-59 కింద క్రమబద్ధీకరణ కోసం ఎంపికైన లబ్ధిదారుల నుంచి రుసుం వసూలు త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ పరిధిలో ఇంటి పట్టాల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో జిల్లాకు సంబంధించి లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



సాక్షి, మేడ్చల్ జిల్లా: అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. న్యాయమైన కోర్కెలు తీర్చాలని డిమాండ్ చేస్తూ కొద్ది రోజులుగా అంగన్‌వాడీలు ఆందోళన బాట పట్టారు. ఈ నేపథ్యంలోనే బుధవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ- ఏఐటీయూసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చాయి. అందులో భాగంగా మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో పాటు సీఐటీయూ నాయకులను పోలీసు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు, పోలీసుల మధ్య తోపులాట జరగటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గృహలక్ష్మీ పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు చేసేందుకు మంత్రి మల్లారెడ్డి రావడంతో పోలీసులు ఆందోళనాకారులను అరెస్టు చేసి శామీర్‌పేట, అల్వాల్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అంగన్‌వాడీ ఉద్యోగులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ తీవ్రంగా ఖండించారు. సీఐటీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు జి.శ్రీనివాసులు, లింగస్వామి, గణేష్, కిష్టప్ప, ఉన్ని కృష్ణ, అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు సునీత, శోభారాణి, భాగ్యరేఖ, మీనాక్షి, అంజమ్మ, శ్రీదేవి, అరుణ, రాధ, మహాలక్ష్మి, మంజు, రామదేవి పాల్గొన్నారు.

ఇల్లు లేని పేదలకు 'గృహలక్ష్మి' వరం

రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మల్లారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: నిరుపేదలకు గృహలక్ష్మి పథకం వరం లాంటిదని, పేదలకు మంచి చేయాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని తెచ్చారని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఖాళీ స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులందరికీ గృహలక్ష్మీ కింద ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు గృహలక్ష్మీ పథకానికి సంబంధించిన మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేదలకు ఎంతో మేలు చేయాలనే ఆలోచనతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం కింద ఖాళీ స్థలం, ప్లాట్ ఉన్న వారికి రూ.3 లక్షల చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. మూడువేల ఇళ్లకు మంజూరు కాగా మొదటి విడతలో 800 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి వెల్లడించారు. ఈ పథకంలో కొన్ని నిబంధనలు ఉన్నాయని, వాటిని సడలింపు చేసేలా సీఎం కేసీఆర్‌తో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు గృహలక్ష్మి పథకం రూపొందించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసమూర్తి, తహశీల్దార్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్: మహిళా బిల్లు సాధనలో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్సీ కవితను అభినందిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని కవిత నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి సంబరాలు జరుపుకున్నారు. కవితను కలిసిన వారిలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్, సంతోష్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, వీరాంజనేయులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

